

నారాయణపేట రూరల్, ధన్వాడ పోలీస్ స్టేషన్ భవనాల ప్రారంభ శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంలో (ఎడమ నుంచి) మంత్రి సీతక్క, ఎమ్మెల్యే శంకర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, మంత్రి దామోదర రాజనరసింహ, సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్



అప్పక్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన సభకు హాజరైన మహిళలు



సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పాలమూరుపై.. పగబట్టిన కేసీఆర్

- ఇక్కడ పంటలు పండటం.. ప్రజల కన్నీళ్లు తుడవటం ఆయనకు ఇష్టం లేదు
- ఏ పని చేపట్టినా అడ్డంపడుతున్నాడు.. ఇందుకేనా పాలమూరు ఎంపీని చేసింది
- అప్పుడు పోతిరెడ్డిపాడుకు, ఇప్పుడు రాయలసీమకు సహకరించి జిల్లాకు అన్యాయం
- ఈ ప్రాంత బిడ్డగా సంపూర్ణ విశ్వాసం ఉంచండి.. భూసేకరణకు సహకరించండి
- రూ.10 లక్షలు కాకపోతే రూ.20 లక్షలు పరిహారం ఇచ్చి మీ బిడ్డగా అండగా ఉంటా
- పదేళ్లలో పీఆర్‌ఎల్‌ఐ పూర్తి చేయలేదు.. పగతో పేట- కొడంగల్ లిఫ్టును చేపట్ట లేదు
- వేల కోట్ల నిధులు ఇచ్చి.. ఉమ్మడి పాలమూరును అభివృద్ధి చేసే బాధ్యత నాది
- నారాయణపేట ప్రజాపాలన ప్రగతి సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నీటితో నాగరికత.. నీటితో పసిడి పంటలు.. నీటితోనే అభివృద్ధి.. సమీపంలో కృష్ణానది పారుతున్నా.. 811 టీఎంసీలు వెళ్లిపోతున్నా.. ఈ ప్రాంతానికి నీళ్లివ్వాలని అనిపించలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చాలామంది ముఖ్యమంత్రులు అయ్యారు. పాలమూరు పేరు చెప్పుకుని మార్కెటింగ్ చేసి, పబ్బం గడుపుకున్నారు. 2009లో కరీంనగర్ నుంచి పారిపోయి వచ్చిన కేసీఆర్‌ను తెలంగాణ వస్తే, పాలమూరును దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానంటే నమ్మి ఆశీర్వదించాం.. ఎంపీని చేశాం.. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేళ్ల అధికారంలో ఉన్న కేసీఆర్ పాలమూరును అభివృద్ధి చేయకపోగా.. పగబట్టారు" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ, మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా నారాయణపేట మండలం అప్పక్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన- ప్రగతి సభలో మాట్లాడారు. కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేయలేదన్నారు. జూరాల నుంచి తీసుకోవాల్సిన ప్రాజెక్టును శ్రీశైలం నుంచి రీడిజైన్ పేరుతో చేపట్టి, అంచనాలను రూ.55 వేల కోట్లకు పెంచి, కమీషన్లు దొబ్బారని విమర్శించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం కుప్పకూలిందన్నారు. శ్రీశైలం నుంచి చేపట్టిన పీఆర్‌ఎల్‌ఐ పూర్తి కాలేదని, ఇప్పుడు అదే శాపంగా, పాపంగా మారిందన్నారు. 2004 తర్వాత పోతిరెడ్డిపాడుకు సహకరించి.. పదేళ్లలో రాయలసీమ ఎత్తిపోతలకు సహకరించారన్నారు. అది పూర్తయితే నెల రోజుల్లో 300 టీఎంసీల నీటిని ఏపీ తీసుకుని

(మిగతా 6లో..)



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి; చిత్రంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

వైద్య వృత్తి.. ఒక భావోద్వేగం

- గ్రామీణ ప్రాంత ప్రజలకు అనుబంధంతో వైద్య సేవలు అందించాలి
- ప్రభుత్వం వసతులు కల్పిస్తోంది.. వాటిని సద్వినియోగం చేసుకోవాలి
- వైద్య విద్యార్థులతో ముఖాముఖిలో సీఎం రేవంత్‌రెడ్డి

6

సీఎం, ఎంపీ మధ్య సరదా సంభాషణ

పోలేపల్లి ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు

- సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మంత్రులతో కలిసి పూజలు
- మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి తరలొచ్చిన భక్తులు

6



నారాయణపేటలో ఎంపిక చేసిన 13 గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సీఎం, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అరుణ, మంత్రి దామోదర మాటామంతి



మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో స్కూటీలో పెట్రోల్ పోస్తున్న మంత్రి సీతక్క



సభలో సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సీఎం వస్తుండగా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



కళాకారుల ఆటపాట

సత్తా చాటిన 'సుల్తాన్'

- పోటీల్లో పాల్గొన్న 20 పొట్టేళ్లు
- విజేతగా నిలిచిన అయిజ పొట్టేలు

7



పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు

సేమ్ టు సేమ్

- నేడు కవలల దినోత్సవం

7

జలాల పంపిణీ కోసం దీక్ష చేయండి

» పార్టీలకు అతీతంగా దీక్షలో పాల్గొంటాం : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇరు రాష్ట్రాల మధ్య ప్రధాన సమస్యగా ఉన్న కృష్ణా జలాల పంపిణీ కోసం అధికార కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ప్రధాని కార్యాలయం ముందు దీక్ష చేయాలని, ఆ దీక్షలో పార్టీలకు అతీతంగా పాల్గొని మద్దతు తెలుపుతామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సాగునీటి రంగంపై అవగాహన లేదని మండిపడ్డారు. నీటి జలాల పంపిణీ కోసం కేంద్రంపై పోరాటం చేసి ఇరు రాష్ట్రాలకు 50 శాతం పంపిణీ చేసేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా జలాలను ఈ ఒక్క సీజన్‌లోనే 660 టీఎంసీల నీళ్లు వాడుకుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర మంత్రులకు, ఎమ్మెల్యేలకు రాష్ట్ర అభివృద్ధిపై కనీసం అవగాహన కూడా లేదని విమర్శించారు. 2019లోనే ఇరు రాష్ట్రాలకు కృష్ణా జలాల వాటాను పంపిణీ చేయాలని రిక్వెస్ట్ చేసినా ఆనాడు కేంద్రం పట్టించుకోలేదన్నారు.

ప్రధాన కారణం ఆనాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇద్దరు స్నేహితులు కాబట్టి ఆనాడు కేంద్రం ఈ సమస్యను పరిష్కరించకుండా నానబెట్టుకుంటూ వచ్చిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రంపై పోరాటం చేసి నీటి జలాల పంపిణీ సమస్యను పరిష్కరించాలన్నారు.

అన్ని రంగాల్లో ఈ ప్రభుత్వం విఫలమైందని, మంత్రులకు ఎమ్మెల్యేలకు వ్యక్తిగత విమర్శలు తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ రమేష్ గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ అశోక్, సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుపై పగబట్టిన కేసీఆర్



స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీఎం చెప్పగా చేతులెత్తి సంఘీభావం చెబుతున్న(ఎడమ నుంచి) అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, టి.రాంమోహన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

(5వ పేజీ తరువాయి)

పోతుందని, పాలమూరును ఎడారి చేయడమే కేసీఆర్ లక్ష్యంగా పని చేశారని అన్నారు. ఇప్పుడు ప్రాజెక్టులు కడతామంటే, పరిశ్రమలు పెడతామంటే అడ్డుపడుతున్నారన్నారు. లగచర్లలో పరిశ్రమలు పెట్టొద్దంటా?.. ఉపాధి, ఉద్యోగాలు రావొద్దనే చందంగా బీఆర్ఎస్ వైఖరి తయారైందని విమర్శించారు. 2014లో రూ.1,500 కోట్లతో వెనుకబాటులో ఉన్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి జీవో తెస్తే.. తనపై కోపంతో పదేళ్ల పట్టించుకోలేదన్నారు. తాను వచ్చిన తర్వాత ఆ జీవో దుమ్ము దులిపి, ఇప్పుడు టెండర్లు పిలిచి పనులు చేపడితే మళ్లీ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ ప్రాంత బిడ్డగా తనపై సంపూర్ణ విశ్వాసం ఉంచాలని, భూసేకరణకు సహకరించాలని కోరారు. పరిహారం రూ.10 లక్షలు కాకపోతే రూ.20 లక్షలు ఇస్తానని, నిధులు ఇచ్చే స్థాయిలో 70 ఏళ్ల తర్వాత ఈ పాలమూరు బిడ్డనే ఉన్నారని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌ను కూడా పూర్తిచేసే బాధ్యత తనదేనని, నష్ట పరిహారం సంపూర్ణంగా అందజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. పదేళ్లలో కేసీఆర్ పాలమూరు- రంగారెడ్డి పూర్తి చేసి ఉంటే.. ఇప్పుడు చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదని అన్నారు.

పదేళ్లలో గొప్పలు చెప్పుకున్న నాయకుల కంటే పది రెట్లు ఎక్కువ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని రూ.8లక్షల కోట్ల అప్పులు చేసి.. రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టారన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కేసీఆర్ అంటున్నారని, కానీ బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోవడం వల్లనే.. అసెంబ్లీలో ఓటమి చెంది, పార్లమెంటులో ఒక్క సీటు కూడా గెలవలేదని అన్నారు. ఈ టర్మ్‌లో నాలుగేళ్ల సమయం ఉందని, ఆ తర్వాత మరో అయిదేళ్ల సమయంలో తెలంగాణ అభివృద్ధి చెందుతున్నారు. మళ్లీ అధికారంలోకి రావడం బీఆర్ఎస్ కల అని అన్నారు. పదేళ్ల పాలనపై, ప్రజా పాలనపై ఏ వేదిక ద్వారానైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

పదేళ్ల కంటే పదిరెట్ల అభివృద్ధి: మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజా ప్రభుత్వం ఏర్పడి.. 14 నెలలవుతోందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. చెప్పిన మాటను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరం చేసేందుకు మూసీ ప్రక్షాళన చేస్తున్నామన్నారు.

వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదు: మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రతీ మాటను నిలబెట్టుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రభుత్వం 14 నెలల సమయంలో ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు ఇస్తున్నామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరు చేసిందన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. 1931లో కుల గణన జరిగితే.. దేశంలో 2004-2005లో కుల గణన చేసింది కాంగ్రెస్సేనని తెలిపారు. కులాల సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను తెలుసుకోవడానికి మళ్లీ ఇప్పుడు కులగణన చేశామన్నారు. 40 ఏళ్ల ఆకాంక్ష అయిన వర్గీకరణ చేశామన్నారు. సమాజంలో సమానత్వం కోసం హక్కులు కల్పించాలని అంబేడ్కర్ చెప్పారని,ఈ వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదని అన్నారు. 59 కులాలు.. తెలంగాణలో 52 లక్షల పైచిలుకు జనాభా వాటా కోసం సుప్రీం తీర్పు ఇస్తే.. గంటలోపు సీఎం అసెంబ్లీలో ప్రకటించారన్నారు. సీఎం ఆరు నెలల్లో సబ్ కమిటీ నియమించి.. ఆ సిఫారసుల ద్వారా వన్‌మెన్ కమిషన్, దాని ద్వారా ఏ, బీ, సీ, డీ కాదు.. ఏ, బీ, సీ వర్గీకరణ తీర్మానం చేశామన్నారు. మాదిగలకు 9.7 శాతం ఈ ప్రభుత్వం రిజర్వేషన్ ఇవ్వబోతుందని అన్నారు.

ఏడాదిలోనే రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు : పర్ణికారెడ్డి



నారాయణపేట, టౌన్ (ఆంధ్రజ్యోతి): 'మీ ఆడబిడ్డగా ఆదరించారు. పదేళ్ల ఒక లెక్క.. ఇప్పుడు ఒక లెక్క. ఏడాదిలోనే రూ.వెయ్యి కోట్లతో ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసుకోవడం అభివృద్ధికి తొలి మెట్టు. రాబోయే రోజుల్లో నారాయణపేట నియోజకవర్గం రూపు రేఖలు మారుస్తాం' అని అన్నారు నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి. రాష్ట్రంలోనే మహిళా సమాఖ్య తొలి మహిళా పెట్రోల్ బంక్‌ను నారాయణపేటలో ప్రారంభించుకున్నామన్నారు. నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలిరావడం, అందులో మహిళలు అధికంగా ఉండటం సంతోషకరమన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి ఇదివరకు మనోడు ఉంటే ఇచ్చేవారని, చెక్కు వచ్చినా చించేసే సంస్కృతి ఉండేదని, ఇప్పుడు రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఇచ్చారని, కొండాపూర్, కోయిలకొండ మండలం గణపతి రాజ్ చెరువులు నింపితే సాగునీరు అందుతుందన్నారు. నారాయణపేటకు మన్యంకొండ నుంచి మిషన్ భగీరథ నీరు వస్తుందని, ఎక్కడైనా లీకేజీ అయితే నీరు రావడం కష్టంగా మారుతుందన్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు మంచినీటి వసతి ప్రత్యామ్యంగాకల్పించాలని కోరారు. సొంత ఊరు ధన్వాడలో డిగ్రీ కాలేజీకి సొంత భవనం, ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, నారాయణపేట మునిసిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మరికల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధన్వాడలో రోడ్ డివైడ్, మార్కెట్ యార్డు అప్‌గ్రేడ్‌లు ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో పేట నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు.

వైద్య వృత్తి.. ఒక భావోద్వేగం

● గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అనుబంధంతో వైద్య సేవలు అందించాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నారాయణపేట మెడికల్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫొటో దిగుతున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తదితరులు

మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మారుమూల ప్రాంతమైన నారాయణపేట జిల్లాలో మెడికల్, పారామెడికల్, నర్సింగ్ కాలేజీలు రావడం వల్ల ఇతర జిల్లాలు, రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి అవకాశం వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో 8 మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇచ్చి, ఎన్ఎంసీ అనుమతులు లేక వాయిదాలు పడుతున్న సందర్భంలో కార్యదర్శి క్రిస్టినా, మంత్రి దామోదర కలిసి.. అనుమతులు సాధించారన్నారు. తాము సౌకర్యాలు కల్పిస్తామని, అందుకు రూ.వందల కోట్లు కేటాయించేందుకు సిద్ధమని తెలిపిన సీఎం.. విద్యార్థులు గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించి.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంబేడ్కర్ చెప్పినట్లు రంగుల గోడలు, అద్దాల మేడలు అభివృద్ధికి సూచిక కాదని, పేదల సంక్షేమం, విద్య చేరినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని అన్నారు. నారాయణపేట మెడికల్ కాలేజీకి.. 50 సంవత్సరాలు ఈ ప్రాంతానికి సేవలు అందించిన చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టడాన్ని పరిశీలించాలని సీఎస్‌కు ఆదేశాలు జీరీ చేశారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్‌లో పారామెడికల్, నర్సింగ్ స్టాఫ్‌కు డిమాండ్ ఉందని, భవిష్యత్‌లో అక్కడ ఉన్న అవకాశాలను పరిశీలించి.. ప్రభుత్వమే వారికి కేరీర్ భరోసా కల్పిస్తుందని తెలిపారు. వైద్య వృత్తి ఉద్వేగం మాత్రమే కాదని, భావోద్వేగమని అన్నారు. డాక్టర్ స్టూడెంట్ పర్ణికారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారని, అందరి కష్టాలు తెలిసిన నాయకురాలిగా ఆమె ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. మళ్లీ వచ్చే సంవత్సరం ఏ పని పెట్టుకోకుండా విద్యార్థులను కలవడానికి వస్తానని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని ఇక్కడికే తరలించేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వైద్య విద్య అనేది కల అని.. దాన్ని నెరవేర్చుకునే దిశలో క్రమశిక్షణ, కమిట్‌మెంట్, డెడికేషన్‌తో పని చేయాలని కోరారు. సామాన్యుడు దేవుడని డాక్టర్‌ను నమ్ముతాడు కాబట్టి, వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని సూచించారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలు ఉండాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ మంజూరు ఇచ్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పేద పిల్లలకు ఈ అవకాశం వచ్చిందని, చదువు పూర్తయిన తర్వాత కూడా పట్టణాలకు వెళ్లకుండా మారుమూల ప్రాంతాల్లో పేద ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

విద్యార్థులతో ముఖాముఖి

ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించగా.. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన శ్రీధర్ మాట్లాడుతూ తనకు సీటు వస్తుందా? అనే అభద్రతలో ఉన్నప్పుడు ప్రభుత్వం 8 నూతన మెడికల్ కాలేజీలను మంజూరు చేయించిందన్నారు. రైతు బిడ్డకు ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం కల్పించిదన్నారు. నల్గొండ జిల్లా తిరుమలగిరిసాగర్ మండలానికి చెందిన సత్యజ్యోతి మాట్లాడుతూ.. అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు గురుకులాల్లోనే చదువుకున్నానని, అలాంటి తనకు మెడికల్ సీటు రావడం గర్వంగా ఉందన్నారు. తమ తండాలో మొదటి ఎంబీబీఎస్ విద్యార్థిని తనేనని చెప్పారు. కేరళకు చెందిన అదిరా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కొత్త కాలేజీ అని మొదట భయపడ్డానని, కానీ సౌకర్యాలు బాగున్నాయన్నారు. స్టాఫ్, స్నేహితులు సహకరిస్తుండటంతో పీజీ కూడా ఇక్కడే చేసి, ఈ రాష్ట్రంలోనే సర్వీసు అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఉట్కూరు మండలం తిప్రాసుపల్లికి చెందిన పారామెడికల్ విద్యార్థి సాయిమాధురి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో వైద్య సౌకర్యాలు తక్కువని, ఇప్పుడు మెడికల్, పారామెడికల్, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు వల్ల వైద్యసేవలు మెరుగవుతాయని అన్నారు. వికారాబాద్ జిల్లా నవాల్గకు చెందిన నర్సింగ్ విద్యార్థి నవనీత మాట్లాడుతూ రాష్ట్రంలో 16 కొత్త నర్సింగ్ కాలేజీల ఏర్పాటు వల్ల తనలాంటి ఎంతోమందికి అవకాశం దక్కిందన్నారు.

సీఎం, ఎంపీ మధ్య సరదా సంభాషణ

మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎప్పుడూ ఉప్పు నిప్పులా వాగ్బాణాలు విసురుకునే సీఎం రేవంత్‌రెడ్డి, పాలమూరు ఎంపీ డీకే అరుణ మధ్య నారాయణపేట జిల్లాలో సరదా సంభాషణ జరిగింది. మహిళా సమాఖ్య పెట్రోల్ పంపు ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులతో ఔటర్ రింగు రోడ్డుపై మహిళా శక్తి ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పడంతోపాటు డీకే అరుణ సహకారంతో ప్రధాని మోదీని కూడా ఆహ్వానించుకుని.. నిధులు రాబట్టుకుందామని అన్నారు. ఇప్పుడు కేంద్రం నిధులు ఇస్తుందని డీకే అరుణ సమాధానం ఇచ్చారు. తల్లి గారు ఇచ్చినా.. అత్తగారు ఇచ్చినా పిల్లల భవిష్యత్ కోసమే వాడతామని, కేంద్ర, రాష్ట్రాలకు ఎన్నికల సమయంలో మినహా మిగతా సమాయాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలని తెలిపారు. అరుణమ్మ అటు తల్లిగారి నుంచి ఇటు అత్తగారి ఇంటి నుంచి నిధులు తెచ్చుకోవాలని కోరారు. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో పోటాపోటీగా మాట్లాడుతున్న వీరు.. సరదాగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆసక్తిని రేకెత్తించింది.



పలు అభివృద్ధి పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ డీకే అరుణ

రూ.వెయ్యికోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

- చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీగా నామకరణం చెయ్యండి : సీఎం

నారాయణపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలతో పాటు అభివృద్ధిలో పోటీపడేలా నారాయణపేటలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి వెయ్యి కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. హెలిప్యాడ్‌లో దిగి కాన్వాయ్‌లో రోడ్డు మార్గం గుండా వచ్చిన సీఎం రూ. 1.23 కోట్లతో జిల్లా మహిళా సమాఖ్య ద్వారా రాష్ట్రంలోనే తొలి మహిళా పెట్రోల్ బంకును ప్రారంభించారు. అటు నుంచి అప్పక్‌పల్లి దగ్గర ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం పారపట్టి పనులు ప్రారంభించి శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మెడికల్ కాలేజీ దగ్గర విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. డాక్టర్‌గా ఎమ్మెల్యే పర్ణి



నారాయణపేట మండలం అప్పక్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం

కమ్మ ఉండటం ఈ ప్రాంతవాసుల అదృష్టం అని మారుముల ప్రాంతంలో మెడికల్ కాలేజీ, పారామెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు ప్రారంభించడం సంతోషకరం అన్నారు. మెడికల్ కళాశాలకు దివంగత ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారికి సూచించారు. ప్రభుత్వ వైద్యకళాశాల, వసతి గృహాల నిర్మాణం కోసం రూ. 130 కోట్లు, ప్రభుత్వ వైద్యకళాశాలలో రూ. 56 కోట్లతో అకాడమిక్ బ్లాక్ నిర్మించడం, తల్లిబిడ్డల ఆరోగ్య సంరక్షణ సేవల కోసం రూ. 40 కోట్లతో వంద పడకల ఆసుపత్రి, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం రూ. 200 కోట్లతో అన్ని తరగతుల రెసిడెన్సియల్ స్కూల్స్ ఒకేచోట లింగంపల్లి దగ్గర నిర్మించేందుకు 20 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు. నర్సింగ్ కాలేజీ నిర్మాణానానికి రూ. 26 కోట్లు, రూ. 5.58 కోట్లతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్లు ప్రారంభోత్సవం చేశారు. రూ. 295 కోట్లతో తంకిమెట్ల - నారాయణపేట రోడ్, కోటకోండ - మద్దూర్ రోడ్ అభివృద్ధి పనులు, అప్పక్‌పల్లి-గుండుమాల్ రోడ్, మద్దూర్- లింగల్‌చెడ్‌రోడ్ లలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 488 కోట్లతో గుల్బర్గ- కోడంగల్, రావుల్‌పల్లి -మద్దూర్, కోస్గి - దౌల్తాబాద్ రోడ్ 97 కిలోమీటర్లు శంకుస్థాపనలు, రూ. 12.70 కోట్లతో నారాయణపేట నియోజకవర్గంలో సీఆర్ఆర్ రోడ్లుకు శంకుస్థాపన, రూ. 7 కోట్లతో మరికల్‌లో నిర్మించనున్న మండల పరిషత్ కార్యాలయం కాంప్లెక్స్ బిల్డింగ్ ప్రారంభోత్సవాలు చేశారు. జిల్లాలో 13 గ్రామాలలో 859 ఇందిరమ్మ గృహాలకు మంజూరు పత్రాలు ఇవ్వగా ఇంటి నిర్మాణానికి నాలుగు విడతలుగా ఐదు లక్షల ప్రకారం రూ. 42.95 కోట్లు అందించనున్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్

- సీఎం హెలికాప్టర్ దిగగానే సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ పూలబొకె ఇచ్చి స్వాగతం పలికారు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కమిషనర్ చౌహాన్, ఎస్పీ యోగేష్ గౌతమ్ సీఎంకు పూల బొకె ఇచ్చి స్వాగతం పలికారు
- కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీఎం రేవంత్ రెడ్డికి పూల బొకెతో స్వాగతం పలికారు
- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు శివ కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సదాశివరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి బొకెలు ఇచ్చి స్వాగతం పలికారు.
- సీఎం హెలిప్యాడ్ నుంచి నేరుగా సింగారం చౌరస్తా దగ్గర మహిళా సంఘం ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి మాట్లాడారు.
- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ చేశారు.
- మెడికల్ కళాశాల భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ్మా, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ అరుణ, ఎమ్మెల్యేలు పర్ణి కారెడ్డి, వాకిటి శ్రీహరి కలిసి ప్రారంభించారు. నర్సింగ్ కాలేజీ పారా మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశారు.
- మెడికల్ కళాశాల విద్యార్థులతో సీఎం ముఖాముఖిగా మాట్లాడారు.
- సభా వేదికపై సీఎం వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. ● బహిరంగ సభకు మహిళలు భారీఎత్తున తరలివచ్చారు.
- మహిళలను సీఎం సభకు తరలిచేందుకు ఆర్టీసీ బస్సులను వాడుకోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు.
- అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రికి ఎంపీ డీకే అరుణ అందజేశారు.

- నారాయణపేటటౌన్, (ఆంధ్రజ్యోతి)

పోలేపల్లి ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు

- సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మంత్రులతో కలిసి పూజలు - మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి తరలొచ్చిన భక్తులు



షిడెకు హాజరైన అశేష జనవాహిని

కోస్గి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భక్తుల కోర్కెలు తీర్చే పోలేపల్లి ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టం షిడె రోజు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఉత్సవాలు జరుగుతుండటంతో మంత్రులతో కలిసి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సీఎం హోదాలో అమ్మవారిని దర్శించుకోవడం గర్వంగా ఉందని చెప్పారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనరసింహ, జూపల్లి కృష్ణారావు ఉన్నారు.

ఘనంగా షిడె

ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు షిడె పైనుంచి భక్తులకు దర్శనమిచ్చారు.మూల విరాట్‌ను తొట్టెలలో ఉంచి, దానిని రథానికి పైభాగాన అమర్చి, రథాన్ని ఆలయం చుట్టూ ఐదు సార్లు తిప్పారు. ఇలా తిప్పుతున్నప్పుడే భక్తులు గబ్బల బండారు చల్లుతూ, దీవించమ్మా అంటూ మొక్కుకున్నారు. ఏటా మహా శివరాత్రి ముందు వచ్చే శుక్రవారం ఎల్లమ్మ జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనడానికి రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

● కలెక్టర్ ఆదర్శ్ సురభి



బ్లాక్ బోర్డుపై గణితాన్ని బోధిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చక్కగా చదివి, అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలి కల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మాత్రమే అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా గణితంపై కొన్ని ప్రశ్నలు సంధించి, స మాధానాలు రాబట్టారు. సరైన విధంగా గణిత సమస్యలను పరి ష్కరించిన విద్యార్థులకు చాక్లెట్లు అందజేశారు. పాఠ శాలలో అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణానికి సంబంధించి ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు.

పాఠశాలలో ఉన్న పెండింగ్ పనుల పూర్తి చేయడానికి అంచనాల నివేదికను సమర్పించా లని ఆదేశించారు.

● భవిత కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. స్థానిక కేడీఆర్ నగర్‌లోని మండల విద్యాధికారి కార్యాలయంలో భవిత (ప్రత్యేక అవసరాల బాలబాలికల జిల్లా వనరుల కేంద్రం)ను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. భవిత సెంటర్‌లో ఉన్న చిన్నా రులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు.

ఫిజియోథెరపీకి సంబంధించి వైద్య శాఖ నుంచి థెరపిస్టును పిలిపించే ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు యుగంధర్, శేఖర్, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, భవిత కేంద్రం సిబ్బంది ఉన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టండి

కొత్తకోట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం లో పర్యటిస్తున్న మంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేయండని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మండలంలోని సంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం పామాయిల్ కంపెనీ శంకుస్థాపన చేయడానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వస్తున్నారు. మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ శుక్ర వారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి పర్యటన సం దర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనారు.

ఉద్యాన, వ్యవసా య శాఖల స్టాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్రహ్మ ణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు అక్బర్, గోవిందు నాయక్, మదనాపురం మార్కెట్, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్లు ప్రశాంత్, గొల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఆది దంపతుల విహారం

- మూడోరోజు శ్రీశైలంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



హంస వాహనంపై విహరిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

శ్రీశైలం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇల కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబు చేసి హంసవాహనంపై కొలువదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ క్షేత్రపుర వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. ఈ వాహన సేవలో భక్తులు వేలాదిగా తరలిరావడంతో క్షేత్ర వీధులన్నీ కిక్కిరిశాయి. శనివారం మయూర వాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు.

ప్రొఫెషనల్ కాంగ్రెస్ నేషనల్ హెడ్‌గా జిల్లెల ఆదిత్య రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అనుబంధ సంస్థ ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ నేషనల్ హెడ్‌గా డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ చక్రవర్తి శుక్రవారం నియామక పత్రాన్ని ఆదిత్యరెడ్డికి అందజేశారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి ప్రస్తుతం ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి నియమితులు కావడం పట్ల నాయకులు హర్షంప్రకటించారు.

జాతీయ స్థాయి క్రీడలకు వంగూరు ఉపాధ్యాయుడు



దినేష్ కుమార్

వంగూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వంగూరు మండలంలోని నిజం బాద ఉపాధ్యాయుడు పల్లేటి దినేష్ కుమార్ పాల్గొని జాతీ య స్థాయి సివిల్ సర్వీస్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యారు. వ చ్చే నెల 14 నుంచి 26 వరకు ఢిల్లీలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడు. దినేష్ కుమార్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల కు ఎంపిక కావడం పట్ల ఎంపీఈవో మురళీమోహనచారి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



సేమ్ టు సేమ్

నేడు కవలల దినోత్సవం

రూపం ఒకటే.. అభిరుచులూ ఒకటే.. ఎవరు ఎవరో తెలియక అందరూ తికమక పడుతూ ఉంటారు.. ఒక్కోసారి తల్లిదండ్రులు కూడా గందరగోళానికి గురవుతుంటారు.. తమ్ముడి కోసం వచ్చి అన్నను పలుకరిస్తారు.. అన్న కోసం వచ్చి తమ్ముడితో మాట్లాడుతుంటారు.. నేను కాదు అంటే ఆశ్చర్యపడుతూ ఉంటారు.. అక్క అనుకొని చెల్లిని పిలుస్తారు.. చెల్లి అనుకొని అక్క వద్దకు వెళ్తారు.. కవల సోదరులు, సోదరీమణులతో వచ్చిన చిక్కు ఇది.. ఫిబ్రవరి రెండో నెల, ఈ నెలలో 22వ తేదీన రెండు రెళ్లు వస్తాయి కాబట్టి చొక్కాపు వెంకటరమణ అనే మెజీషియన్ స్థానికంగా ఈ తేదీని 'ట్విన్స్ డే'గా నిర్వహించడం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కొందరు కవలలు, వారి తల్లిదండ్రులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. వివరాలు మీకోసం..

- నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

మాట్లాడేది పెద్దోడా... చిన్నోడా?



మహబూబ్‌నగర్‌కు చెందిన రాగతన్విని, రాగతన్మయని

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : రాగతన్విని, రాగతన్మయని.. ఇద్దరు చిన్నారులు రెండు నిమిషాల తేడాతో జన్మించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని భగీరథ కాలనీకి చెందిన ఎద్దుల శోభ, విష్ణువర్ధన్‌రెడ్డి దంపతులకు 2009, మే 30న వారు జన్మించారు. ఇద్దరినీ చిన్నోడా.. పెద్దోడా అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. రూపాల్లో స్వల్ప తేడా ఉన్న ఇద్దరి కంఠస్వరం మాత్రం ఒకేలా ఉంటుంది. ఫోన్లో మాట్లాడితే తల్లిదండ్రులు కూడా గుర్తు పట్టలేరు. మాట్లాడేది చిన్నోడా.. పెద్దోడా? అని అడిగి తెలుసుకోవాల్సిందే. ప్రస్తుతం ఇద్దరూ మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నారు. రాగతన్విని చదువుల్లో రాణిస్తోంది. రాగతన్మయని చదువుతో పాటు చిత్రలేఖనంలోనూ ప్రతిభ చూపుతోంది. ఒకరంటే ఒకరికి ప్రాణం. ఎక్కడికి వెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్తారు. పండుగలు వస్తే ఇద్దరూ ఒకే రకమైన దుస్తులు వేసుకుంటారు.

బింబం.. ప్రతిబింబం



బల్మూరుకు చెందిన చరిత, చరిష్మా

అచ్చంపేట : ఇద్దరూ ఒకేలా బింబం.. ప్రతి బింబం అన్నట్లుగా ఉంటారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడితే అద్దంలో చూసుకున్నట్లే ఉంటుంది. అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు గ్రామానికి చెందిన లక్ష్మి, శేఖర్ దంపతుల కవల కుమార్తెలు చరిత, చరిష్మా.. ఇద్దరూ ఒకేలా ఉండటంతో తోటి విద్యార్థులు గందరగోళానికి గురవుతూ ఉంటారు. బడికి ఒకే డ్రస్‌లో వెళ్తే ఉపాధ్యాయులు కూడా ఒకరు అనుకొని మరొకరిని పిలుస్తూ తికమక పడుతుంటారు.

- బల్మూరు మండలంలోని పోలేపల్లికి చెందిన శ్వేత, రమేశ్ దంపతుల కుమారులు శ్రీమన్‌విరాట్, సూర్య విశిష్ట్‌లు ఇద్దరూ ఒకేలా ఉంటారు. మొదట్లో వారి ప్రవర్తనను బట్టి గుర్తించే వాళ్లమని తల్లిదండ్రులు చెప్తున్నారు. ఇద్దరికీ ఒకే రకమైన దుస్తులు కుట్టిస్తామని, ఒకే రకమైన ఆట వస్తువులు కొనిపిస్తామని, లేకపోతే వారు ఒప్పుకోరని అంటున్నారు.



పెనిమిళ్లకు చెందిన అంజి అనిల్



పోలేపల్లికి చెందిన శ్వేత, రమేష్

- ఉప్పునుంతల మండలం, పెనిమిళ్లకు చెందిన వెంకటయ్య, యాదమ్మ దంపతుల కుమారులు అంజి, అనిల్ నిమిషాల వ్యవధిలో జన్మించారు. ఇద్దరూ ఎక్కడికి వెళ్లినా బంధువులు, స్నేహితులు ఎవరు ఎవరో తెలియక గందరగోళపడుతూ ఉంటారు. ఇద్దరమూ ఒకేలా ఉండటం మా అదృష్టం అని వారు చెప్తున్నారు.

నిమిషం చిన్నోడు.. వాడి మాట నేనెందుకు వింటాను



మహబూబ్‌నగర్‌కు చెందిన మణికంఠ, ప్రణవిల చిన్నప్పటి ఫొటో

మహబూబ్‌నగర్ న్యూటౌన్ : 'వాడు నాకంటే ఒక నిమిషం చిన్నోడు. వాడి మాట నేనెందుకు వింటాను' అని తమ్ముడు మణికంఠను ఉద్దేశించి తరుచూ అంటూ ఉంటుంది అక్క ప్రణవి. మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన నాగరాజు, లలిత దంపతులకు 2004, అక్టోబరు 19న కవలలు వెంకటసాయి మణికంఠ, ప్రణవి నిమిషం వ్యవధిలో జన్మించారు. ఇద్దరూ కవలలైనా వారి లక్ష్యాలు విభిన్నం. ప్రస్తుతం వెంకటసాయి ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ప్రణవి ఉస్మానియ లా కళాశాలలో న్యాయశాస్త్రం 4వ సంవత్సరం చదువుతోంది. నిమిషం వ్యవధిలో పుట్టిన వారిద్దరూ భిన్న దృక్పథాలు, లక్ష్యాలతో ముందుకు సాగుతున్నారు.

అచ్చం అచ్చు గుద్దినట్లే !





నారాయణపేట పట్టణానికి చెందిన అక్కాచెల్లెళ్లు అద్వీత, అన్వీత, శ్రుతి పల్లవి

నారాయణపేట : నారాయణపేట జిల్లా కేంద్రంలోని పళ్ల ప్రాంతానికి చెందిన మాణిక్ శాస్త్రి, ప్రతిమ దంపతులకు మూడో సంతానంగా 2020, జూన్ 10న ఇద్దరు ఆడపిల్లలు రెండు నిమిషాల వ్యవధిలో జన్మించారు. ఇద్దరూ ఒకేలా ఉండటంతో తల్లిదండ్రులు వారికి అద్వీత, అన్వీత అని పేర్లు పెట్టారు. ఇద్దరూ అచ్చు గుద్దినట్లు ఒకేలా ఉండటంతో ఎవరు ఎవరో గుర్తించడం కొంచెం కష్టమే. ప్రస్తుతం స్థానిక బ్రిలియంట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నారు.

- నారాయణపేట జిల్లా కేంద్రంలోని పళ్ల ప్రాంతానికి చెందిన గడ్డం సిద్దు, అశ్విని దంపతులకు 2013, జూలై 18న కవల పిల్లలు శ్రుతి, పల్లవి జన్మించారు. రెండు నిమిషాల వ్యవధిలో పుట్టిన వారిద్దరూ ఒకేలా ఉండటంతో గుర్తు పట్టడం ఇబ్బందే అని తల్లిదండ్రులు చెప్తున్నారు. ప్రస్తుతం వారిద్దరూ కృష్ణ గోకులం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నారు.

కవల సోదరులతో కన్‌ఫ్యూజ్

బిజినేపల్లి : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వ గ్రామానికి చెందిన కవల సోదరులు సురభి మల్లేశ్‌రావు, సురభి మహేశ్‌రావులను చూసి బంధువులు, స్నేహితులు ఇప్పటికీ కన్‌ఫ్యూజ్ అవుతుంటారు. సురభి హైమావతి, జనార్దన్ రావు దంపతులకు 1991, ఆగస్టు 17న వారు జన్మించారు. మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్న తమను గుర్తు పట్టడంలో భార్యలు కూడా ఒక్కోసారి పొరబడుతుంటారని నవ్వుతూ తెలిపారు. తమ్ముడు సురభి మహేశ్‌రావు గతంలో గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. వివిధ పనుల మీద వచ్చే వారు నేనే సర్పంచ్ అనుకొని తనతో మాట్లాడేవారని మల్లేశ్‌రావు చెప్పారు. నేను కాదు తమ్ముడు సర్పంచ్ అంటే గందరగోళానికి గురయ్యేవారని అన్నారు.



గుడ్లనర్వకు చెందిన మల్లేశ్‌రావు, మహేశ్‌రావు

రమేశా.. మహేశా?



తుర్కలపల్లికి చెందిన రమేశ్, మహేశ్

చారకొండ : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన బొమ్మరమోని లక్ష్మయ్య, లాలమ్మలకు 1989లో తొలి సంతానంగా కవలలు జన్మించారు. వారికి రమేశ్, మహేశ్ అని పేర్లు పెట్టారు. 15 ఏళ్లు వచ్చే వరకు రమేశ్ ఎవరో, మహేశ్ ఎవరో తల్లిదండ్రులు కూడా గుర్తు పట్టలేకపోయేవారు. గ్రామస్థులు, స్నేహితులు కూడా తికమక పడేవారు. వారికి పెళ్లయిన కొత్తలో భార్యలు కూడా ఇబ్బంది పడేవారు. అత్తింటి వారు కూడా ఎవరు ఎవరో తెలుసుకోలేక గందరగోళానికి గురవుతూ ఉంటారు. ప్రస్తుతం రమేశ్ ఎల్ఐసీ ఏజెంటుగా, చారకొండ సింగిల్‌విండో డైరెక్టరుగా ఉన్నాడు. మహేశ్ ఊర్కొండ మండలంలోని మాదారం సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజకీయ నాయకులు, ఎల్ఐసీ ఏజెంట్లు కూడా ఒకరు అనుకొని మరొకరితో మాట్లాడతారని రమేశ్, మహేశ్ తెలిపారు. వారి తండ్రి లక్ష్మయ్య, వారి పెద్దనాన్న రాములు కూడా కవలలే కావడం విశేషం.



రమేశ్, మహేశ్‌ల తండ్రి లక్ష్మయ్య, పెద్దనాన్న రాములు

అక్కాచెల్లెళ్లు.. నాట్య మయూరాలు



మంథన్‌గోడ్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు అనన్య, శరణ్య

కోయిలకొండ : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం, మంథన్‌గోడ్‌కు చెందిన సత్యనారాయణ జోషి, తులసి దంపతుల కుమార్తెలు అనన్య, శరణ్య. ఒకే రూపంతో ఉండే వీరిద్దరూ నృత్యంలో ప్రతిభ చాటుతున్నారు. ప్రస్తుతం తొమ్మిదవ తరగతి చదువుతున్నారు.

- కోయిలకొండ మండల కేంద్రానికి చెందిన కావలి దేవేందర్, లలితలకు కవలలు జన్మించారు. వారికి దివిజ్, దీక్ష అని పేరు పెట్టుకున్నారు.



కోయిలకొండకు చెందిన కవలలు దివిజ్, దీక్ష

వచ్చింది రాముడా? లక్ష్మణుడా?

పాలమూరు : మహబూబ్‌నగర్ పట్టణంలోని 42వ వార్డు కౌన్సిలర్ రాము, ఆయన తమ్ముడు లక్ష్మణ్‌లు నిమిషాల తేడాతో జన్మించారు. ఇద్దరి ఆహారపు అలవాట్లు, వ్యవహారం ఒకేలా ఉంటుంది. ఇద్దరూ ఒకే రూపుతో ఉంటారు. దీంతో వీరు ఎవరింట్లోకైనా వెళ్తే వచ్చింది రాముడా? లక్ష్మణుడా? అంటూ బంధువులు, స్నేహితులు తికమక పడుతుంటారు. అలా కాకుండా తమను గుర్తు పట్టేందుకు వారిద్దరూ ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరిస్తున్నారు. లక్ష్మణ్ ఎప్పుడూ టోపీ పెట్టుకొనే ఉంటాడు. రామ్ పెట్టుకోడు. ఇద్దరికీ వివాహాలయ్యాయి. భార్యా పిల్లలతో కలిసి పక్కపక్క ఇళ్లలోనే ఆనందంగా జీవిస్తున్నారు.



మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన రామ్, లక్ష్మణ్

ఒకే రూపం.. ఒకే వృత్తి

ఏఎన్ఎంలుగా గంగ, మంగ

బిజినేపల్లి : బిజినేపల్లి మండలం మంగనూర్ గ్రామానికి చెందిన కవల సోదరీమణులు గంగ, మంగలు. వారిద్దరూ ఒకే రూపంలో ఉండటంతో పాటు, ఒకే వృత్తిలో కొనసాగుతున్నారు. ఇద్దరూ వైద్య, ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంలుగా విధులు నిర్వరిస్తున్నారు. ఇద్దరూ ఒకే పీహెచ్‌సీలో పని చేస్తుండటంతో వైద్యాధికారులు, తోటి సిబ్బంది తరుచూ తికమక పడుతూ ఉంటారు. బంధువులు కూడా గుర్తు పట్టేందుకు ఇబ్బంది పడతారు. ఒకే రూపంలో పుట్టడం మాకు ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు.



ఏఎన్ఎంలుగా పని చేస్తున్న అక్కాచెల్లెళ్లు గంగ, మంగ

గుర్తు పట్టడం కష్టమే



శంకర్, శంకర్‌లింగం



ముద్విన్, ముద్విక్

మక్తల్ : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని వినాయక్‌నగర్‌కు చెందిన నాగరాజు, మంజుల దంపతుల కవల కుమారులు శంకర్, శంకర్‌లింగం, సురేశ్, యమునల కుమారులు ముద్విన్, ముద్విక్ ఒకే పోలికలతో ఉంటారు. వారిని తల్లిదండ్రులు తప్ప బయటివారు గుర్తించడం కష్టమే. వారు ఆడుకునేటప్పుడు కాలనీ వాసులు ఎవరు ఎవరో గుర్తుపట్ట లేక ఇబ్బంది పడుతుంటారు. సరదాగా వారితో సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకొని ఆనందిస్తారు.

ఉదండాపూర్‌లో రీ సర్వే ప్రారంభం

» సహకరించిన నిర్వాసితులు



ఇళ్లకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ముంపునకు గురవుతున్న ఉదండాపూర్ గ్రామంలో శుక్రవారం రీ సర్వే ప్రారంభించారు. గ్రామంలో ఇళ్ల కొలతలు, ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్నారు. మొత్తం 10 బృందాలు రీసర్వేలో పాల్గొంటున్నాయి. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగిందని గ్రామస్థులు తెలిపారు. పునరావాసం ప్యాకేజీతో పాటు పెంచిన పరిహారాన్ని ఒన్ టైం సెటిల్‌మెంట్‌తో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రిలే దీక్ష చేపట్టిన నిర్వాసితులు కూడా తమ ఇళ్లకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. రీ సర్వేకు తాము వ్యతిరేకం కాదని పేర్కొన్నారు.

కేఎల్ఐ కాలువలో పడిన ద్విచక్రవాహనం

» యువకుడి మృతి » తాడూరు సమీపంలో ఘటన

ఉప్పునుంతల ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం కేఎల్ఐ కాలువలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని తాడూరు సమీపంలో గురువారం రాత్రి ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన సంబు వినోద్ గౌడ్ (26) ద్విచక్రవాహనంపై తాడూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి స్వగ్రామానికి గిరిగి వెళ్తుండగా, ద్విచక్రవాహనం అదుపుతప్పి, కేఎల్ఐ కాలువలో పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ రెడ్యానాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి సంబు సుల్తాన్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సత్తా చాటిన 'సుల్తాన్'

» పోటీల్లో పాల్గొన్న 20 పొట్టేళ్లు » విజేతగా నిలిచిన అయిజ పొట్టేలు

అయిజ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి పొట్టేళ్ల పోటీలో అయిజకు చెందిన పొట్టేలు సుల్తాన్ ఎదురులేని విజేతగా నిలిచింది. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో కొనసాగుతున్న తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొనేందుకు రాయలసీమ, తెలంగాణ, కర్ణాటక, మహా రాష్ట్ర ప్రాంతాలకు చెందిన 20 పొట్టేళ్లు వచ్చాయి. మధ్యాహ్నం 1-20 నిమిషాలకు ప్రారంభమైన ఈ పోటీల్లో ఢీ అంటే ఢీ అన్నట్లుగా కొనసాగాయి. తిలకించటానికి వచ్చిన వీక్షకుల ఈలలు, చప్పట్లతో ప్రాంగణం మారుమోగింది. చివరికి అయిజ పట్టణానికి చెందిన డల్లా నర్సింహులు పొట్టేలు సుల్తాన్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేల బహుమతిని కైవసం చేసుకున్నది. రాజోళికి చెందిన పొట్టేలు కిల్లర్ రెండవ స్థానాన్ని సొంతం చేసుకొని రూ. 35 వేలు గెలుచుకున్నది. హైదరాబాద్‌కు చెందిన ఎంజే గ్రూపు పొట్టేలు మూడవ స్థానంలో నిలిచి, రూ.20 వేలు అందుకున్నది. క్రైమ్‌మేకర్ గ్రూపు పొట్టేలు మూడవ బహుమతిగా రూ.10వేలు దక్కించుకున్నది.



ప్రథమ బహుమతి సాధించిన పొట్టేలు సుల్తాన్‌తో నిర్వాహకులు



తలపడుతున్న పొట్టేళ్లు

'ఎన్ఎంఐఎంఎస్' గుర్తింపు రద్దు చేయాలి

» యూనివర్సిటీ వద్ద విద్యార్థి సంఘాల ధర్నా

జడ్చర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి టీఎస్ఐఐసీ ప్రాంగణంలోని నార్సీ మోంజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎన్ఎంఐఎంఎస్) యూనివర్సిటీలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటనకు నిరసనగా శుక్రవారం యూనివర్సిటీ వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు, సభ్యులు శుక్రవారం యూనివర్సిటీ వద్ద సుమారు గంట పాటు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్, నందు, శ్రీనాథ్, బన్నీ, శ్రీకాంత్, సాయి, సురేశ్, నరేశ్, రమేశ్‌లు, ఏబీవీపీ నాయకులు సతీశ్, రాజేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

చిరుత దాడిలో లేగదూడ మృతి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలో చిరుత పులి మరోసారి అలజడి రేపింది. గురువారం రాత్రి ఓ లేగదూడను హతమార్చి తిన్నది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోస్గి శ్రీనివాస్ తన పశువులను గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని పొలంలో కట్టేసి ఇంటికి వచ్చారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన చిరుత లేగదూడను చంపేసింది. ఉదయం గమనించిన రైతు శ్రీనివాస్ వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారి అధికారి వెంకటేశ్ సిబ్బందితో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

తెలకపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని ఆలేరులో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాషమోని యాదగిరి, శివలీ దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం రాత్రి తమ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ మేరకు ఆమె తండ్రి పిట్టల యాదగిరి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రతీ ఒక్కరు సామాజిక సేవ చేయాలి

- ఎస్‌ఐ శ్రీనివాసరావు



ఉప్పల పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన ఎస్‌ఐ శ్రీనివాసరావు

అయిజ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీవ్యక్తి సామాజిక సేవను అలవర్చుకోవాలని అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం అయిజ మండలంలోని ఉప్పలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. అయిజ మండలం సింధనూర్ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మూలగుండం శివరామకృష్ణ దాతగా ముందుకు వచ్చి 16మంది పాఠశాలకు వచ్చే గ్రామీణ విద్యార్థులకు అందజేశారు. ఈసైకిళ్లను ఎస్‌ఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములు, హెచ్‌ఎం బలరాం, ప్రజాప్రతినిధులు సత్యారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, లాల్‌గౌడు, భాస్కర్‌గౌడ్, లక్ష్మన్న పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- శాంతినగర్‌లో ప్రజలకు కళాకారుల అవగాహన

వడ్డేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలందరూ పలు జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా సురక్షితంగా ఉండాలని గద్వాల సారథి ప్రభుత్వ కళాకారులు సూచించారు. కలెక్టర్ బీఎం సంతోష్‌కుమార్ సారథ్యంలో డీపీఆర్‌వో ఆరీఫుద్దీన్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రాహల్ నేతృత్వంలో శుక్రవారం శాంతినగర్‌లో ప్రజలకు ఎండల తీవ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గద్వాల సారథి ప్రభుత్వ కళాకారులు ఆట, పాటల రూపంలో వేసవి బారి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రాకూడదని, వడదెబ్బ బారిన పకడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కళాకారులు రేలారే ప్రసాద్, కేశవులు, రమాదేవి, భూపతి, కవిత, హజరత్, స్వామి ఉన్నారు.

ఘనంగా ప్రతిభ ఉత్సవాలు

అలంపూరుచౌరస్తా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీ పరీక్షలు జరిగాయి. ఇందులో మండల వ్యాప్తంగా 48 మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. తెలుగులో రాయడం, చదవడం, గణితం, చిత్రలేఖనం తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించగా 3వ తరగతి విభాగంలో తక్షశిల పాఠశాలకు చెందిన సోహేల్, 4వ తరగతి విభాగంలో మెన్నిపాడు పాఠశాలకు చెందిన సుగుణాకర్, 5వ తరగతి విభాగంలో ఉండవల్లి పాఠశాలకు చెందిన సాఫ్రీన్ మొదటి స్థానంలో నిలువగా డ్రాయింగ్ విభాగంలో మారమునగాల పాఠశాలకు చెందిన వర్ష, క్విజ్‌లో సోహేల్, పరమేశ్వరి, వాసు, అఖిలప్రియ, స్కిట్‌లో చంద్రనాయుడు, భూమిక, అస్రాన్ ప్రతిభ చూపినట్లు ఎంఈవో రామకృష్ణ తెలిపారు. వీరికి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. విజేతలు ఈనెల 24న జిల్లా కేంద్రంలో జరిగే పోటీ పరీక్షల్లో పాల్గొంటారని ఎంఈవో తెలిపారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శాంతినగర్ తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు రెండు రేషన్‌కార్డులు రాకుండా చూడాలని, అదే సమయంలో సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీలర్లకు సూచించారు. కేటాయించిన సమయంలోపు బియ్యాన్ని పంపిణీ చేసి, ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో ఆర్‌ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు ఉన్నారు.

మనుగడలోలేని సొసైటీకి బీ లైసెన్స్

- సహకార చట్టానికి అధికారుల తూట్లు
- నాయకుల కనుసన్నల్లో కల్లు దుకాణాలు



జములమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న కల్లు దుకాణం

గద్వాల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార చట్టం ఎక్కడా అమలుకావడం లేదు. ఈ పరిస్థితిపై గీత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని జమ్మిచేడు కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం పాలకవర్గం కాలపరిమితి తీరిపోయింది. కానీ రెండేళ్లుగా ఎన్నికలు నిర్వహించడం లేదు. కల్లు సొసైటీ ఆధ్వర్యంలో త్రీమెన్ కమిటీతో కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. దానికి అనుబంధంగా జములమ్మ ఆలయం వద్ద బీ లైసెన్స్‌తో మరో దుకాణం నిర్వహించారు. త్రీమెన్ కమిటీని రెండుసార్లు పొడిగించారు. సహకార సంఘం చట్టం ప్రకారం మూడవ సారి పొడిగించడానికి అవకాశం లేనప్పటికీ త్రీమెన్ కమిటీ మనుగడలో ఉందంటూ జములమ్మ ఆలయం వద్ద నిర్వహించే కల్లు దుకాణానికి బీ లైసెన్స్‌ను జారీ చేశారని సమాచారం. అధికార పార్టీకి చెందిన నాయకుల ఆశీస్సులు, ఎక్సైజ్ శాఖ అధికారుల అండదండలతో జములమ్మ దేవత ఆలయం వద్ద కల్లు దుకాణం నిర్వహిస్తున్నారని గీత కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఆచారాన్ని అడ్డుగా పెట్టుకొని దందా

జములమ్మ బ్రహ్మోత్సవాలలో అమ్మవారిని కొలిచే భక్తులు కల్లుతోనే నైవేద్యం పెట్టే ఆచారం ఉంది. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ప్రతి మంగళ, శుక్రవారాలలో అమ్మవారిని కొలిచేందుకు మూడు రాష్ట్రాల నుంచి వేలసంఖ్యలో భక్తుల వస్తారు. ఈసందర్భంలో కల్లు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రతి మంగళవారం 350కిపైగా, శుక్రవారాలలో 150కి పైగా పెట్టెల విక్రయాలు జరుగుతాయి. ఒక్కో సీస ధర రూ.30లు ఉంటుంది. ఈ ఐదునెలల కాలంలోనే దాదాపుగా రూ.1.20కోట్ల కల్లు విక్రయాలు జరుగుతాయని గీత కార్మికులు అంటున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి ఫీజులు లేకుండా సొసైటీ సభ్యులకు వాటా ధనం లేకుండా ఆదాయాన్ని పొందుతున్నారు. ఇది కాకుండా జమ్మిచేడులో కల్లుదుకాణం నుంచి కూడా ఏడాది పొడవునా కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. గద్వాల పట్టణంలో కల్లు విక్రయాలు నిలిచిపోవడంతో పట్టణంలోని కల్లు ప్రియులు జమ్మిచేడులోని కల్లుదుకాణానికి వెళ్లివస్తుంటారు. ఇవన్నీ ఆ సొసైటీ త్రీమెన్ కమిటీకి కలిసి వస్తున్నది. దీంతో గడువు తీరినా, నిబంధనలు ఒప్పుకోకపోయినా అధికార పార్టీ నాయకుల అండదండలతో నిర్వహిస్తూ గీత కార్మికుల కడుపుకొడుతున్నారని వారు వాపోతున్నారు.

మండలంలో మరో అనధికార డిపో

గద్వాల మండలం నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వెళ్లే దారిలోని ఓ గ్రామంలో అధికార పార్టీలోని మరో వర్గం వారు అనధికారికంగా కల్లు డిపో నిర్వహిస్తున్నారు. ఆ డిపో నుంచి దాదాపు 20గ్రామాలలోని అనుమతి ఉన్న కల్లు దుకాణాలతో పాటు అనుమతిలేని కల్లు దుకాణాలకు కల్లు సరఫరా అవుతున్నది. ఇవన్నీ ఎక్సైజ్ అధికారులకు తెలిసినా తెలియనట్లు ఉంటున్నారు.

ఎన్నికలు నిర్వహించాలి



గీత పారిశ్రామిక సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి. సొసైటీ పాలకవర్గం కాలపరిమితి తీరిపోయి రెండేళ్లు అవుతుంది. ఎక్సైజ్ అధికారులు త్రీమెన్ కమిటీతో కల్లు విక్రయాలు చేస్తున్నారు. దాని సమయం కూడా అయిపోయింది. అధికారులు స్పందించి ఆటు సొసైటీకి, గీత కార్మికులకు న్యాయం చేయాలి.

- సత్యనారాయణగౌడ్, గీత కార్మికుడు, జమ్మిచేడు

మూడోసారి అనుమతి ఎలా ఇస్తారు



జమ్మిచేడు సొసైటీకి అధికారులు ఎన్నికలు నిర్వహించకుండా త్రీమెన్ కమిటీతో కల్లు విక్రయాలు చేస్తున్నారు. రెండుసార్లు పూర్తి అయ్యింది. మూడవ సారి ఎలా అనుమతి ఇస్తారు. ఇది నిబంధనలకు విరుద్ధం. వెంటనే ఎన్నికలు నిర్వహించి పాలకవర్గంకు కల్లు విక్రయాలు అప్పగించాలి. అప్పుడే సభ్యులకు గీత కార్మికులకు న్యాయం జరుగుతుంది.

- కృష్ణయ్య గౌడ్, సభ్యుడు, జమ్మిచేడు

అనుమతి కోసం నివేదించాం

హైకోర్టులో కేసు ఉండటంతో జమ్మిచేడులోని కల్లు సొసైటీకి ఎన్నికలు నిర్వహించలేదు. అందుకే త్రీమెన్ కమిటీ ద్వారా కల్లు దుకాణం నిర్వాహణ జరుగుతుంది. రెండు పర్యాయాలు పూర్తి అయ్యింది. మూడవ సారి ఎక్సైజ్ కమిషనర్ నుంచే అనుమతి తీసుకోవాలి. అందుకోసమే ఉన్నతాధికారులకు నివేదించాం. సహకార చట్టం ప్రకారం మూడు సార్లు కూడా తీసుకోవచ్చు. జమ్మిచేడు పరిధిలోనిదే జములమ్మ దగ్గర కల్లు దుకాణం. దానికి బీ లైసెన్స్ ఉంది.

- గణపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ గద్వాల

సృజనాత్మకతకు మాతృ భాషతోనే బాటలు

● ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అవగాహన సామర్థ్యానికి, విషయ పరిజ్ఞానానికి మాతృ భాష అత్యంత కీలకమని, వ్యక్తి సృజనాత్మకతకు మాతృ భాష బాటలు వేస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. అమ్మ ఒడిలో నుంచి వచ్చిన మాతృ భాషను కాపాడుకోవడం, గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రిన్సిపాల్ మాట్లాడారు. సమాజాన్ని నిశితంగా పరిశీలించే శక్తి అవగాహన సామర్థ్యంతోనే సాధ్యమని, అందుకు మాతృ భాషను మించిన మార్గం మరొకటి లేదని ప్రిన్సిపాల్ మాతృ భాషకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల తెలుగు విభాగం అధిపతి హరినాగ భూషణం మాట్లాడుతూ సృష్టికి బ్రహ్మ ఎంత మూలమో, కావ్యాల సృష్టిలో సాహితీవేత్తలు, కవులు కూడా అంతే కీలకమన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషా

సమాజ విశ్లేషణ, ప్రజాచైతన్యం, పెంచి పోషించడంలో సాహితీవేత్తల కృషి వెలకట్టలేనిదన్నారు. మహాకవి శ్రీశ్రీ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సినారే, ప్రజాకవి నగ్నముని వంటి వారి కవితలను వినిపించారు. అదే సమయంలో భాష ఉద్యమాలు, మాతృ భాష ప్రాముఖ్యత, భాషాభివృద్ధి కోసం జరుగుతున్న కృషి గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చంద్రమోహన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని

గట్టు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి మండలానికి, జిల్లాకు పేరు తేవాలని డీఈవో అబ్దుల్ ఘని విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు రాగి చిక్కి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మార్నింగ్ న్యూట్రిషన్‌లో భాగంగా ఇన్‌స్పైర్‌తో పాటు అన్నపూర్ణ ట్రస్ట్ సహకారంతో రాగి చిక్కి అందిస్తున్నట్లు ఎంఈవో నల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఇన్‌స్పైర్ కోఆర్డినేటర్ ఇనాయిస్, అన్నపూర్ణ ట్రస్ట్ కోఆర్డినేటర్ ఆనందు, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సత్యకళ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కంచుపాడులో ఆరబోసిన మిర్చి పంటను పరిశీలిస్తున్న రైతుసంఘుల నాయకులు

అలంపూరు చౌరస్తా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎండుమిరపకాయ రైతులను ఆదుకోవాలని రైతుసంఘుల నాయకులు జీకె ఈదన్న, సింగరాజుమద్దిలేటి, కంచుపాడు మాజీ సర్పంచు శేషన్‌గౌడు తదితర నాయకులు డిమాండ్ చేశారు. వీరు మరికొంతమంది నాయకులతో కలిసి ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో ఆరబోసిన మిర్చిపంటను పరిశీలించారు. గిట్టుబాటు ధర కల్పించకపోతే అప్పులే మిగులుతాయని రైతులు వాపోయారు. స్వామినాథన్ కమిషన్ ఆధారంగా క్వింటాకు రూ.25వేలుగా ధర నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శాలన్నగౌడు, శాంతమ్మ, శ్రీనివాసులు, మహేశ్వరమ్మ, పురుషోత్తంరావు, మధు, లక్ష్మీదేవమ్మ తదితరులు ఉన్నారు.

ప్రతిభా పోటీలతో నైపుణ్యం వెలికితీత

- ఎంఈవో రవీంద్రబాబు

ధరూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యం వెలికి తీయవచ్చని ఎంఈవో రవీంద్రబాబు అన్నారు. ధరూరులోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మూడు, నాల్గవ తరగతి విద్యార్థినులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, వివిధ అంశాలపై నిర్వహించే పోటీల ద్వారా బహిర్గతమవుతాయన్నారు. ధరూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రతాపరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు ప్రతిభా పోటీలు నిర్వహించడం వల్ల వారిలో చురుకుదనంతో పాటు ఎన్నోరకాల ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయన్నారు. అనంతరం విద్యార్థినులకు కథలు చెప్పడం, చదవడం, రాయడం, స్పెల్లింగ్, డ్రాయింగ్, డ్రామా, నాటకం, క్విజ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయ్, శివ, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి 15 శాతం నిధులు కేటాయించాలి

● సీఆర్‌పీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

గట్టు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యాభివృద్ధికి 15 శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్‌పీఎఫ్) గట్టు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ చేశారు. ఈమేరకు గట్టు మండలంలో సమావేశమైన కమిటీ సభ్యులు సీఎంకు సంతకాల లేఖను పంపనున్నట్లు వెల్లడించారు. 15శాతం నిధులు కేటాయించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు మండల కమిటీ అధ్యక్షుడు నరేష్ డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ధరూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బాధితుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ధరూర్ పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ధరూర్ పోలీస్‌స్టేషన్‌లో వీవో-వై 200ఈ మోడల్ సెల్‌ఫోన్‌ను ఎస్‌ఐ కొండ శ్రీహరి బాధితుడికి అందజేశారు. అలాగే ఐదుగ్రాముల బంగారాన్ని నెట్టెంపాడు గ్రామానికి చెందిన యజమాని ఎల్లప్పకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బస్టాండ్, రద్దీప్రాంతాలు, మార్కెట్లు, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

భాషా విశిష్టతకు పద్యాలు ప్రతిరూపం

● డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్ రెడ్డి

గద్వాల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా ఔనత్యానికి, విశిష్టతకు పద్యాలు తలమానికమని డీసీఈబీ కార్యదర్శి నాగేటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని బాలభవన్‌లో తెలంగాణ తెలుగు టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు సాహిత్యం, పద్యపఠనంపై క్విజ్‌పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతాప్‌రెడ్డి, విద్యార్థుల్లో పద్యపఠన పట్ల ఆసక్తిని పెంచేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు భాషలోని పద్యాలు కేవలం భాషా విశిష్టతకే కాకుండా వ్యక్తిత్వ విలువలను, సామాజిక స్థితిగతుల్లోని వాస్తవికతను ప్రతిబింబించేవిగా ఉండటం భాషాభిమానులకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా, క్విజ్ పోటీల్లో ప్రథమ విజేతగా టి.శివకుమార్(జడ్పీహెచ్‌ఎస్, ధరూర్), ద్వితీయ విజేతగా పవిత్ర(జడ్పీహెచ్‌ఎస్ ఉత్తనూరు), పద్య పఠనలో ప్రథమ విజేతగా కే.వైష్ణవి(కేజీబీవీ అలంపూర్), ద్వితీయ విజేతగా జి.అక్షయ(ఎంపీపీఎస్ అల్వాల్‌పాడు) నిలిచారు. కార్యక్రమంలో జిల్లా విద్య సమన్వయ అధికారి ఎస్తేరురాణి, గద్వాల ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, జీహెచ్‌ఎంలు భాస్కర్, శివశంకర్, తెలుగు టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్, అంబటి భానుప్రకాష్, సభ్యులు సత్యనారాయణగౌడ్, భాస్కర్, జీవీ సురేష్‌బాబు, రాజగోపాల్ రెడ్డి ఉన్నారు.



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలకు చేర్పించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశహాలులో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పిల్లల హక్కుల పరిరక్షణ కోసం అన్నిశాఖలు సమష్టిగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయలన్నారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతంగా కొనసాగుతుందని, దీని అమలును మరింత మెరుగుపరిచేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల తరగతి హాజరు తప్పనిసరి అని, ఈ చివరి నెలలో గైర్హాజరు కాకుండా చూడాలని, విద్యార్థులు చదువును మధ్యలో నిలిపివేయకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయాలని, లేకపోతే రూ.50వేల జరిమానా విధించబడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్య, డీడబ్ల్యూవో సునంద, డీఎంహెచ్‌వో సిద్దప్ప ఉన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మార్చి 5వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అన్నికేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సదుపాయం, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రానివ్వొద్దు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. వచ్చే వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, నిరంతరం విద్యుత్ సరఫరా జరిగిలే తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. శుక్రవారం జూరాల జనరేషన్ ప్లాంట్‌తో పాటు పట్టణ సమీపంలోని ప్రధాన, ఇతర సబ్‌స్టేషన్‌లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడిన కలెక్టర్, అందుతున్న విద్యుత్ సరఫరా జిల్లాలో ఏమేరకు సరఫరా అవుతుంది, అంతరాయం ఏర్పడితే చేపట్టే ప్రత్యామ్నాయ చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, నిర్వహణ, డిమాండ్ వివరాలతో పాటు సిబ్బంది వివరాలపై సమీక్ష నిర్వహించారు. గృహాలు, ఆస్పత్రులు, వ్యవసాయం, పరిశ్రమలకు అందించే విద్యుత్ సరఫరాలో ఎక్కడ సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించేలా తక్షణ చర్యలు ఉండాలన్నారు. సమస్యలు ఎదురైన సందర్భంగా సంబంధిత అధికారులు సమస్యను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ తిరుపతిరావు, ఏడీఈలు రమేష్‌బాబు, గోవిందు, నవీన్‌బాబు, ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రంగు, పట్టు వల్లే గద్వాల చీరలకు మంచిపేరు



చేనేత కార్మికులకు రంగుల అద్దకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

- రంగుల అద్దకం, రాయితీలపై అవగాహన కలిగి ఉండాలి
- శాస్త్రవేత్తలు శ్రీనివాస, నవీన్ పడకి, దీపక్ చౌదరి

రాజోలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన రంగులు, నాణ్యమైన కోర పట్టును ముడిసరుకుగా వాడకంవల్లే గద్వాల పట్టుచీరలకు దేశవ్యాప్తంగా మంచిపేరు వచ్చిందని శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస, డాక్టర్ నవీన్ పడకి అన్నారు. రాజోలిలోని రైతువేదిక భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సెంట్రల్ సిల్క్‌బోర్డు ధర్మవరంవారి రంగుల అద్దకం, కేంద్రం రాయితీలపై అందించే సామగ్రి గురించి చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. రంగులు అద్దకంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల రానున్న తరానికి పట్టుచీరల గొప్పతనం పెరుగుతుందన్నారు. రంగులు అద్దకం అనంతరం చీర రంగు పోకుండా ఉండాలంటే కొన్ని మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు కేంద్ర సిల్క్ బోర్డు ధర్మవరం వారికి దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ శ్రీనివాస తెలిపారు. కార్మికులు ఉపయోగించే పరికరాలు, ముడిసరుకుల, మగ్గం సామగ్రి, కలర్ ఫ్యాక్టరీ యూనిట్లు సిల్క్ యూనిట్లకు 75శాతం రాయితీ ఇస్తామన్నారు.

అనంతరం రంగుల అద్దకం వేసి చూపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ లోకేష్ హలికట్టి, అశోక్ దేశాయ్, రాజోలి చేనేత సహకార సంఘం ఇన్‌చార్జి అధ్యక్షుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దస్తగిరి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నోరు మెదపని రేవంత్ సర్కార్

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్

దోమలపెంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు రావాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నా సీఎం రేవంత్ రెడ్డి నోరు మెదపడంలేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్‌కుమార్ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన శ్రీశైలం జలాశయాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడుతూ పదేళ్ల క్రితం కేసీఆర్ పాలనలో తెలంగాణకు రావాల్సిన నీటిని తరలించి పాలమూరు బీడు భూములలో పచ్చని పంటలు పండించేటట్లు చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ప్రతీ రోజు ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ నుంచి ఏపీకి జలదోపిడీ జరుగుతుంటే రేవంత్ రెడ్డి అడ్డుకోకుండా ఆంధ్రాకు సహకరిస్తున్నారన్న అనుమానం కలుగుతుందన్నారు. పదేపదే పాలమూరు బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి పంట పొలాలు ఎండుతున్నా జలదోపిడీని ఎందుకు ఆపడంలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో జరుగుతున్న అన్యాయంపై కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పైపులైన్లు వేస్తే ఇంటింటికీ కనెక్షన్ ఎందుకివ్వలేదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి



ఇంటింటికీ కనెక్షన్లు ఇవ్వకుండా ఒకేచోట వేసిన మిషన్ భగీరథ పైపును చూపుతున్న బీజేపీ నాయకులు

గద్వాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ అధికారులు వార్డుల్లో కొత్త పైపులైన్లు వేస్తే ఇంటింటికీ ఎందుకు నల్లా కనెక్షన్లు ఇవ్వలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని 23,35 వార్డుల లో పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి ఇంటికీ మంచినీరు అందిస్తానని 8ఏళ్ల క్రితం మిషన్ భగీరథ పేరిట పనులు మొదలు పెట్టిందని వివరించారు. ఈ మిషన్ భగీరథలో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ స్కీం పేరిట నిధులు ఇవ్వడం జరిగిందని వివరించారు. కొత్త పైపులైన్‌లు వేశామని చెబుతున్న మిషన్ భగీరథ సిబ్బంది ఇంటింటికీ ఎందుకు కనెక్షన్‌లు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో విస్తరించిన కాలనీలలో ఎందుకు మంచినీరు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. మిషన్ భగీరథలో రోజురోజుకూ సమస్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. జిల్లావ్యాప్తంగా అధికారుల అలసత్వం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కొత్తగా కనెక్షన్‌లు ఇవ్వాలని, రోడ్డుపక్కన వాల్వులు, పైపుల లీకేజీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు రజక నర్సింహులు, ఐటీసెల్ కన్వీనర్ చిత్తార్ కిరణ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దేవదాసు, నాయకులు బల్గెర శివారెడ్డి, డబ్బులేటి నర్సింహ, మోహన్‌రెడ్డి, వాసు, భారతి తదితరులు ఉన్నారు.